క్లుప్తంగా

పన్ను చెల్లించండి..


ఇంటి పన్ను రశీదు తీసుకుంటున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ : ప్రతి ఒక్కరూ ఆస్తి పన్ను చెల్లించాలని నగర పంచాయతీ కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు అన్నారు. ఇంటి పన్నుల చెల్లింపుపై ప్రభుత్వం వడ్డీ రాయితీ అవకావం కల్పించిందని, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లి ఇంటి పన్ను రూ. 1.25 లక్షలు చెల్లించి, రశీదు పొందారు.

సేవలతోనే గుర్తింపు

● ఆర్డీఓ వెంకటరమణ


బుచ్చయ్యను సన్మానిస్తున్న పలు సంఘాల నాయకులు

పాలకొండ: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని ఆర్డీఓ వెంకటరమణ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీటీగా పనిచేసి పదవీవిరమణ పొందిన బొమ్మలాట బుచ్చయ్యను రెవెన్యూ, ఎన్జీఓ సంఘాల ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ, 30 ఏళ్ల సర్వీస్‌లో బుచ్చయ్య ఒక్క రిమార్క్ లేకుండా పని చేశారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, ఎన్జీఓ, రెవెన్యూ, సర్వేయర్ల, వీఆర్వోల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు


నిర్మానుష్యంగా మారిన పాలకొండ - సీతంపేట రహదారి

పాలకొండ రూరల్: రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటలకే ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితులున్నాయి. శనివారం ఉదయం 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు వడగాడ్పులు వీయడంతో నిత్యం రద్దీగా ఉండే పాలకొండ–శ్రీకాకుళం, సీతంపేట రహదారులు జనసంచారం లేక వెలవెలబోయాయి.

ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం


రోగితో మాట్లాడుతున్న డాక్టర్ కమల్‌నాథ్

పాలకొండ రూరల్ : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.కమల్‌నాథ్ అన్నారు. మండలంలోని గొట్ట మంగళాపురంలో ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్యశిబిరాన్ని ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రాధాకృష్ణులకు ప్రత్యేక పూజలు


గోపీనాథ రాధాకృష్ణులను దర్శించుకుంటున్న భక్తులు

భామిని: మండలంలోని లివిరి గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి దర్శనానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు రూరల్: మండలంలోని పురోహితుని వలస ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అంజలీ దేవి తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఈ నెల 28 నుంచి నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా సింహాద్రప్పన్న సంబరాలు

సీతానగరం: మండలంలోని కృష్ణారాయపురంలో సింహాద్రప్పన్న (లక్ష్మీనృసింహస్వామి) సంబరాలు రెండో రోజు శనివారం ఘనంగా జరిగాయి. చుక్కల కుటుంబీకుల ఇళ్లల్లో కొలుస్తున్న సింహాద్రప్పన్న సంబరాలు ఆదివారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్ల నృత్యాలు, చెక్క భజనలు అలరించాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

● రయ్..రయ్‌మని..



గోతులతో బిల్లుమడ రహదారి



కొత్తగా వేసిన తారురోడ్డు



అధ్వానంగా ఉన్న రామన్నగూడ- ఎగువ తాడికొండ రహదారి



కొత్తగా వేసిన తారురోడ్డు

టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన బిల్లుమడ రహదారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో బాగుపడింది. కె.గుమ్మడ బీటీ రహదారి నుంచి వయా బిల్లుమడ చిన్నబగ్గ సెంటర్ వరకు దాదాపు ఆరు కిలోమీటర్ల మేర రహదారి గోతులతో నిండిపోయింది. చినుకుపడితే గోతుల్లో నీరు చేరి ఎంతోమంది వాహనచోదకులు ప్రమాదాలబారిన పడ్డారు. రోడ్డును అభివృద్ధి చేయాలని అప్పటి పాలకులను కోరినా పట్టించుకోలేదు. విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి దృష్టికి తీసుకెళ్లగా.. యుద్ధ ప్రాతిపదికన రోడ్డు వేయించడంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై రయ్..రయ్‌మని దూసుకుపోవచ్చని వాహనచోదకులు ఆనందంతో చెబుతున్నారు. అలాగే కురుపాం మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రామన్నగూడ రోడ్డు నుంచి ఎగువ తాడికొండ వరకు గల రహదారి గోతులతో నిండిపోవడంతో రాకపోకలకు వాహన చోదకులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రూ. 1.60 కోట్ల నిధులు మంజూరు చేయడంతో రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు.

– సీతంపేట/కురుపాం

సమన్వయంతో అభివృద్ధి

పాలకొండ: సమన్వయంతోనే నగర పంచాయతీ అభివృద్ధి సాధ్యమని కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు తెలిపారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలిక వసతుల కల్పన కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన వివరించారు. అనంతరం పలు తీర్మానాలు చేపట్టారు. సమావేశంలో చైర్మన్ యందవ రాధాకుమారి, వైస్ చైర్మన్ రైతు హనుమంతురావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలి..

పాలకొండ రూరల్: సుపరిపాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఆ పార్టీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని వెలగాడలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్త లు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

జోరుగా ఉపాధి పనులు

భామిని: మండలంలో ఉపాధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికీ వంద రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో పనులు చేపడుతున్నారు. ఇప్పటికే మూడు వేల కుటుంబాలకు వంద రోజుల పని కల్పించినట్లు ఉపాధి ఏపీఓ తులసీదాస్ తెలిపారు.

నేడు భద్రకాళి, మజ్జిగౌరి జాతర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంత వద్ద భద్రకాళి, మజ్జిగౌరి అమ్మవార్ల ఆలయం వద్ద ఆదివారం జాతర నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి శనివారం తెలిపారు. తెల్లవారు జామున ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

● ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్


కంబరవలసలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, పార్టీ శ్రేణులు

వీరఘట్టం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని నడిమికెల్ల, కడకెల్ల, విక్రమపురం, కంబరవలస, నడుకూరు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు వీరికి విజయ తిలకం దిద్ది, హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. విక్రమపురంలో మహిళలు పెద్ద ఎత్తున 'మేమంతా సిద్ధం' అంటూ నినాదాలు చేశారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే కళావతిని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

వైఎస్సార్‌సీపీలో నూతనోత్సాహం....

ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్‌తో పాటు మండలంలోని పార్టీ నాయకులంతా గ్రామాల్లో పర్యటించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు నూతనోత్సాహంతో మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రచారాన్ని హోరెత్తించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి..

ఎన్నికలు సమీపిస్తుండడంతో కూటమి పేరుతో దొంగల ముఠా వస్తుందని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్ అన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా


నడిమికెల్లలో ఎమ్మెల్యే కళావతి ప్రచారం

పనిచేసిన చంద్రబాబు ఇటువంటి సంక్షేమ పథకాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన కూటమికి అధికార దాహం తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఆలోచన లేదన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి జగనన్నకు మద్దతు పలికాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు జంపు కన్నతల్లి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, సర్పంచ్‌లు దోకల సుజాత, మాచర్ల వెంకటరమణ, కర్రి రమాదేవి, మిడితాన కల్యాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, డోకల శ్రీను, గుంట్రెడ్డి గౌరీశంకరరావు, తెర్లి దాలినాయుడు, మధు, వావిలపల్లి హరిబాబు, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, ఉదయాన జగన్ మోహనరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు వైశ్యరాజు గోవిందరాజు, భోగి మణి, నీలం సత్యంనాయుడు, వావిలపల్లి పురుషోత్తమ రావునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైకల్య నిర్ధారణ పరీక్షలు


భవిత కేంద్రంలో వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, అధికారులు

పాలకొండ రూరల్: ప్రత్యేక అవసరాలు గల 3 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సుగల వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు శనివారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి–2 కురిటి సోంబాబు, జిల్లా సమగ్ర శిక్ష, సహిత విద్యా కోఆర్డినేటర్ పి.భానుమూర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 85 మందికి వైద్యులు పరీక్షలు చేపట్టారు. వీరిలో 10 మందికి వినికిడి యంత్రాలు, 22 మందికి వీల్‌చైర్స్, 8 మందికి రోలేటర్స్ (నడక నేర్చుకునే యంత్రాలు) అందించాల్సి ఉందని నివేదికలు సిద్ధం చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన అందించే ఉపాధ్యాయులు ఐ.గంగాధర్, కె.గెద్దయ్య, ఎం.అరుణకుమారి, కె.సత్యనారాయణ, కె.చక్రధర్, ఆర్.రాంబాబుతో పాటు పిల్లల తల్లితండ్రులు, సంరక్షకులు పాల్గొన్నారు.

నిబంధనలు అమలు చేయాల్సిందే..


సచివాలయ సిబ్బందికి ఎన్నికల నిబంధనలపై సూచనలు చేస్తున్న నోడల్ అధికారి రామకృష్ణ

పాలకొండ రూరల్ : ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాల్సిందేనని నోడల్ అధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని ఎరకారాయపురం, చిన్న మంగళాపురం, గొట్ట మంగళాపురం, తదితర గ్రామాల్లో శనివారం పర్యటించారు. పల్లెల్లో ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్ట్ అమలు తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలపై నిఘా పెట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. అనంతరం గొయిదాపేట ప్రభుత్వ పాఠశాలను సందర్శించి, మధ్యాహ్న భోజన పథకం తీరును పరిశీలించారు.

గ్రంథాలయ సెస్ చెల్లింపు


చలానాను అందజేస్తున్న ఈఓపీఆర్డీ గోపాలరావు

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన 8 శాతం సెస్‌ను ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు చెల్లించారు. ఈ మొత్తాన్ని చలానా రూపంలో గ్రంథాలయ సంస్థ నిర్వాహకులు ఎస్.మధుసూదనారావుకు అందజేశారు. ఉమ్మడి జిల్లాల జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బోనెల లక్ష్మి ఆదేశాల మేరకు గరుగుబిల్లి శాఖా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయి విషయమై ఎంపీడీఓ పి.సూర్యనారాయణకు తెలియజేశారు. ఈమేరకు ఎంపీడీఓ, కార్యదర్శులకు పన్ను బకాయిలను చెల్లించాలని ఆదేశించారు. ఉల్లిభద్ర, తోటపల్లి, పెదగుడబ, రావివలస, షంతోషపురం పంచాయతీలకు సంబంధించి గ్రంథాలయ సెస్ బకాయిలను చెల్లించారు.

గుర్తుతెలియని వ్యక్తి హల్‌చల్


గ్రామస్తుల అదుపులో ఉన్న వ్యక్తి

గరుగుబిల్లి: శరీరమంతా గ్రీజు పూసుకొని ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న ఓ ఆగంతుకుడిని ప్రజలు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లో ఉన్న పెట్రోల్ బంకు వద్ద శనివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ స్థానికులతో వాగ్వాధానికి దిగాడు. గిజబ గ్రామంలోని అమ్మవారి ఆలయంలోకి దూరాడు. మధ్యాహ్నం చర్చిలో ప్రవేశించి ప్రార్థనలు చేస్తున్న మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో స్థానికులు ఆయన్ను అదుపులోకి తీసుకొని చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. అయితే పోలీసులు ఘటనా స్థలానికి రాకపోవడంతో గ్రామంలోనే ఉంచారు. తనతో పాటు మరికొంత మంది ముఠాగా వచ్చామని చెబుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు


రోగులకు తనిఖీలు చేస్తున్న డా.రఘు

గరుగుబిల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం అమలు చేస్తోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డా. కేకే సాగర్‌వర్మ అన్నారు. మండలంలోని శివ్వాం గ్రామంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత వేసవి కాలంలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉత్పన్నమైనా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారులు డా.రఘు, డా. పి. శ్రీధర్ శిబిరాన్ని పరిశీలించారు.

'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ



వీరఘట్టం: రన్ ఫర్ జీసస్ ర్యాలీలో మత విశ్వాసకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ శనివారం నిర్వహించారు. చర్చ్ పాస్టర్లు ఎం.శోభన్‌బాబు, గంటా ప్రకాష్, డేవిడ్ కడియాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో క్రీస్తు విశ్వాసకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్విన్‌పేట జంక్షన్ నుంచి గుమ్మలక్ష్మీపురం వరకు ర్యాలీ సాగింది. ప్రపంచ శాంతిని కోరుతూ 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాస్టర్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని, క్రీస్తు సూచించిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట, పి.లేవిడి విశ్వాసులు పాల్గొన్నారు.

రన్ ఫర్ జీసస్

వీరఘట్టం: మండల కేంద్రంలోని తెలుగు బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు కళింగ ప్రేమభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున క్రైస్తవ సోదరులు పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తూ ఏసుక్రీస్తును స్తుతించారు.


గుమ్మలక్ష్మీపురం: 'రన్ ఫర్ జీసస్' శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మావుడి

మక్కువ: బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులుగా మక్కువ మండలం జెడ్పీటీసీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మావుడి శ్రీనివాసరావును నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు శనివారం జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడిగా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పార్టీ నాపై ఉంచిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గెలుపునకు నా వంతు కృషి చేస్తానన్నారు.

గ్రామాల్లో నిఘా..


చింతలబెలగాంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చినమేరంగి ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. మండలంలోని చింతలబెలగాం, పరజపాడు, లక్ష్మీపురం, పిప్పలభద్ర గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి శనివారం కవాతు నిర్వహించారు. ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వెంకన్నను దర్శించుకున్న భక్తులు


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు ఉదయం స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పలువురు భక్తులు పుట్టుదేవుని వద్ద ప్రత్యేక పూజలు చేసి తలనీలాలు సమర్పించుకున్నారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించా రు. అన్నదాన కార్యక్రమానికి పలువురు విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ, దాతలు చుక్క భాస్కరరావు, డి.ధనుంజయరావు, ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు.